‘బినామీ’ డీలర్లు..!

- ఇటీవల సిద్దాపూర్ సర్పంచ్‌పై కేసు నమోదు
- జోరుగా అక్రమ రేషన్ దందా
- పక్కదారి పడుతున్న పేదల బియ్యం


బియ్యం నిల్వలు పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ (ఫైల్)

బెజ్జూర్: చౌకధరల దుకాణాల ద్వారా ప్రభుత్వం పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం కొంత మంది అక్రమార్కుల మూలంగా పక్కదారి పడుతోంది. ‘బినామీ’ ముసుగులో అక్రమ రేషన్ దందా జోరుగా సాగుతోంది. ఇక్కడి రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. వీరి ఆగడాలను చెక్ పెట్టేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా వ్యవహారం సాగుతోంది. అడపాదడప ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టడంతో కొన్ని సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. కాగా జిల్లాలో మరెంతో మంది ‘బినామీ’ రేషన్ డీలర్లు ఉన్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

జిల్లాలో నమోదైన 6ఏ కేసులు..
జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 6ఏ కేసులు ఆరు నమోదయ్యాయి. జైనూర్ మండలం రసిమెట్ట గ్రామానికి చెందిన మొహిన్, కాగజ్‌నగర్‌కు చెందిన గణపురం ప్రకాశ్, శేషగిరిరావు, పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని పెద్ది శ్రీనివాస్, వాంకిడి మండల కేంద్రానికి చెందిన వనపర్తి సునీత భాస్కర్, ముజహిద్, బెజ్జూర్ మండలం చిన్నసిద్దాపూర్ బినామీ డీలర్‌గా వ్యవహరిస్తున్న సర్పంచ్ పోరెత్తి రవిలపై 6ఏ కేసులు నమోదయ్యాయి. కేసులైన నమోదైన మరుసటి రోజు నుంచే వీరు పైరవీలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. మళ్లీ డీలర్ ఎలాగైనా సంపాదించుకోవాలని కలెక్టర్ కార్యాలయంలో పని చేస్తున్న సన్నిహితులతో లావాదేవీలు సైతం జరుపుతున్నట్లు సమాచారం. ఈ విషయాలపై డీఎస్‌వో తారామణిని వివరణ కోరగా 6ఏ కేసుతో పాటు రేషన్ డీలర్‌షిప్ సైతం రద్దు చేస్తామన్నారు. రెండుసార్లు 6ఏ కేసు నమోదైన వారిపై క్రిమినల్ కేసులు పెడతామని తెలిపారు.

సగానికి పైగా బినామీలతోనే..
రేషన్ షాపు ఎవరి పేరిట ఉంటే వారే రేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. కొంత మంది నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు విన్పిస్తున్నాయి. జిల్లాలోని చౌకధరల దుకాణాల్లో సగానికి పైగా రేషన్ డీలర్లు బినామీలుగా కొనసాగుతున్నారన్నది బహిరంగ రహస్యం. ఉమ్మడి బెజ్జూర్ మండలంలో ఒక ఎంఎల్ఎస్ పాయింట్‌తో పాటు 5 డీఆర్‌డిపోలు, 27 రేషన్ షాపులు ఉన్నాయి. ఇక్కడి ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి చింతలమానెపల్లి మండలంలోని 4 రేషన్ దుకాణాలు, పెంచికల్‌పేట్ మండలంలోని 8 చౌకధరల దుకాణాలు, బెజ్జూర్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని 15 షాపులకు ప్రతీ నెల బియ్యం సరఫరా అవుతోంది.

నామమాత్రపు తనిఖీలు..
చౌకధరల దుకాణాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నామమాత్రపు తనిఖీలు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ దుకాణాల నుంచి పేదలకు సక్రమంగా బియ్యం పంపిణీ జరుగుతుందా.. రిజిస్టర్ మెయింటనెన్స్, బియ్యం నిల్వలు, లబ్ధిదారులకు సరఫరా తదితర విషయాలపై ఆరా తీయాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో అలా జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారే తప్పా పూర్తిస్థాయిలో విచారణ చేయడం లేదని పేర్కొంటున్నారు. అధికారుల అలసత్వాన్ని ఆసరాగా చేసుకొని అక్రమార్కులు బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

జిల్లా వివరాలు..

మొత్తం రేషన్ షాపులు	: 314
రేషన్ కార్డులు	: లక్షా 39వేల724
సరఫరా అవుతున్న బియ్యం	: 300 (మెట్రిక్ టన్నులు)

సిద్దాపూర్ సర్పంచ్‌పై కేసు నమోదు..
బెజ్జూర్ మండలం పెద్దసిద్దాపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పోర్తెట్టి రవిపై ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కేసు నమోదు చేశారు. బినామీగా రేషన్ షాపు నిర్వహిస్తున్నట్లు తేల్చారు. మరోవైపు పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించి సొమ్ము చేసుకున్నట్లు గుర్తించారు. ఐదు క్వింటాళ్ల బియ్యం అక్రమంగా అమ్ముకున్నట్లు తెలిపారు. గతంలో సైతం 18 క్వింటాళ్ల బియ్యం అక్రమంగా విక్రయించగా అప్పట్లోనే ఆయనపై కేసు నమోదు చేశారు.

ఇదివరకే బినామీలపై కేసులు..
రేషన్ దుకాణాల్లో బినామీ డీలర్లుగా కొనసాగుతున్న వారిపై ఇదివరకే కేసులు నమోదయ్యాయి. జిల్లాలోని జైనూర్, వాంకిడి, ఆసిఫాబాద్, బెజ్జూర్ మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున అధికారులు కేసులు నమోదు చేశారు. ఇతరులు సమాచారం ఇస్తే చేసిన నామమాత్రపు తనిఖీల్లో ఇవి బయటపడినట్లు ప్రచారం జరుగుతోంది. అధికారులు పూర్తిస్థాయిలో ఎప్పటికప్పుడు ముమ్మర తనిఖీలు చేపడితే జిల్లాలోని మిగితా బినామీల బండారం కూడా బయటపడుతుందని ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పేద ప్రజల బియ్యం పక్కదారి పట్టకుండా అక్రమార్కులకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత


బాధితునికి ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై సాగర్

వాంకిడి: మండలంలోని ఖమాన గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే యువకుడు గత రెండు నెలల క్రితం ఫోన్ పోగొట్టుకోగా వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. సీఈఐఆర్ టెక్నాలజీతో ఎస్సై సాగర్ ఫోన్‌ను గుర్తించి ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో బాధితునికి అప్పగించారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి


వాలీబాల్ కిట్ అందజేస్తున్న ఎస్సై సాగర్

వాంకిడి: గ్రామీణ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్సై సాగర్ సూచించారు. ఆదివారం మండలంలోని రాజులగూడ గ్రామంలో యువకులకు వాలీబాల్ కిట్ అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ యువత ఖాళీ సమయాల్లో క్రీడలపై దృష్టి సారించాలని, దీని ద్వారా ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. మద్యం, గంజాయి, గుడుంబ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు నాశనమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

‘క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుంది’


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న క్రిష్ణమూర్తి

దహెగాం: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం కలుగుతుందని సర్పంచ్ బండ క్రిష్ణమూర్తి అన్నారు. ఆదివారం మండలంలోని బీబ్రా గ్రామంలో బండ భవాని స్మారకార్థం క్రికెట్ పోటీలు ప్రారంభించారు.

ఆర్ఎంపీ, పీఎంపీల క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీటీసీ

బెజ్జూర్: మండల ఆర్ఎంపీ, పీఎంపీ సంఘం నూతన క్యాలెండర్‌ను ఎంపీటీసీ పర్వీన్ సుల్తాన ఆవిష్కరించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించడంతో పాటు ఆర్ఎంపీ, పీఎంపీలకు ఐడీకార్డులు అందజేశారు. సంఘం మండల అధ్యక్షుడు ఇబ్రహీం, కార్యనిర్వాహక అధ్యక్షుడు సురేందర్, ప్రధాన కార్యదర్శి శివ బిశ్వాస్, కోశాధికారి బి.సత్యనారాయణ యాదవ్, ఉపాధ్యక్షుడు బి.రమేశ్ యాదవ్, ఆర్.బాబురావు, గౌరవ అధ్యక్షుడు శ్రీరామ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

నేరడిగొండ: ఫిబ్రవరి 1 నుంచి 5వరకు ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని నేరడిగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శభాన తరన్నుమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియేట్ బోర్డు నిర్వహించే పరీక్షకు సంబంధించి హాల్ టిక్కెట్ల కోసం విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

సమాజ సేవ అభినందనీయం

ఆదిలాబాద్‌టౌన్: దుర్గం ట్రస్ట్ ద్వారా సమాజ సేవ చేయడం అభినందనీయమని కాంగ్రెస్ మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు బత్తుల మీరబాయి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని దుర్గం ట్రస్ట్ కార్యాలయంలో చైర్మన్ దుర్గం శేఖర్ కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గైక్వాడ్ ధమ్మానంద్, బాపురావు, బాబారావు, ఆశ సొనాలే, సులోచన, సీమ, సుమన్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

నర్సింగ్‌లో ఉద్యోగం సాధించిన యువకుడు

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్ కోటి గ్రామానికి చెందిన యువకుడు ఎల్టి రాకేశ్ నర్సింగ్ ఫలితాల్లో ప్రతిభ కనబరి చాడు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో నర్సింగ్‌గా ఉద్యోగం సాధించాడు. కూలీ కుటుంబానికి చెందిన యువకుడు ఉద్యోగం సాధించడంతో గ్రామస్తులు, తల్లిదండ్రులు అభినందించారు.

అన్నదానం

ఆదిలాబాద్‌టౌన్: సంగెం చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న అన్నదానం ఆదివారంతో 149 వారాలకు చేరుకుంది. ఆదివారం ఆదిలాబాద్ బస్టాండ్ ప్రాంతంలో అన్నదానం నిర్వహించారు. ఆదిలాబాద్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సూపరింటెండెంట్ సంజయ్ కుమార్ అన్నదానానికి సహకరించారు. ఎస్సీ, ఎస్టీ కోర్టు స్టేనోగ్రాఫర్ మల్లారెడ్డిలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు న్యాయవాది సుధీర్ కుమార్ సంగెం, మహేందర్ రెడ్డి, సలీమ్, సుభాష్, రాజయ్య, అంబయ్య, గణేష్ పాల్గొన్నారు.

తరగతులకు హాజరు కావాలి

ఆదిలాబాద్‌టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్ తీసుకున్న పీజీ, డిగ్రీ అభ్యర్థులు రెండో శనివారం, ఆదివారం క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావాలని యూనివర్సిటీ కోఆర్డినేటర్ ప్రతాప్ సింగ్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ ఆదివారం, రెండో శనివారం తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఓపెన్ యూనివర్సిటీ ఆదిలాబాద్ బ్రాంచ్ కౌన్సిలర్స్ ఆర్.గుండయ్య, కొత్త శ్రీనివాస్, అజయ్, హన్మాండ్లు, అన్సార్, శంషీర్ అలీ, అనిల్, ఆర్.శ్రీనివాస్, హరిదాస్ పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ఆదిలాబాద్‌రూరల్: అభినవ సర్దార్ కేతావత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక బీజేపీ నాయకులు చాకటి కిరణ్ ఆదివారం మావల మండలంలోని వాఘాపూర్‌లో దుప్పట్లు పంపిణీ చేశారు. జిల్లాలో చలి తీవ్రత అధికంగా ఉన్నందున నిరుపేద ఆదివాసీలకు దుప్పట్లు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకే టాలెంట్ టెస్టు


ప్రశ్నాపత్రాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ సురేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: విద్యార్థుల్లో దాగి ఉన్న భయాన్ని పోగొట్టేందుకు, ప్రతిభను వెలికి తీసేందుకు టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నామని పీటీజీ(బాలుర) ప్రిన్సిపాల్ సురేశ్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్‌లు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఓయూ జేఏసీ నాయకుడు రాజ్‌కుమార్‌తో కలిసి ప్రశ్నాపత్రాలు విడుదల చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సంఘ నాయకులు టీకానంద్, రాజ్‌కుమార్, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి సాయం

సాక్షి ఎఫెక్ట్..

రెబ్బెన: ఆపదలో ఉన్న చిన్నారికి సాయం చేస్తూ దాతలు మానవత్వాన్ని చాటుతున్నారు. రెబ్బెన మండలం నారాయణపూర్‌కు చెందిన ఏడు నెలల చిన్నారి దాత్రి గుండెవాపు, న్యూమోనియా, రక్తం ఇన్‌ఫెక్షన్, గుండె ఇన్‌ఫెక్షన్ సమస్యలతో ప్రాణాపాయ స్థితిలో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. చిన్నారి తల్లిదండ్రులు పవన్ కల్యాణ్ –శోభ అప్పులు చేసి ఇప్పటికే రూ. 4లక్షల వరకు ఖర్చు చేయగా, వైద్యానికి మరో రూ.10లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. చిన్నారి ప్రాణాలను కాపాడుకునేందుకు దాతల సహాయం కోరగా ఈనెల 27న సాక్షిలో ‘పసిపాపకు పెద్ద కష్టం’ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన దాతలు తోచిన సాయం చేశారు. ఇప్పటి వరకు సుమారు రూ.91వేల వరకు దాతలు ఆర్థిక సాయం చేసినట్లు చిన్నారి తండ్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్య పరిస్థితి కొంతమేర మెరుగుపడిందని సకాలంలో స్పందించిన ‘సాక్షి’కి, ఆర్థిక సాయం చేస్తున్న దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కూలిపోతున్న సెగ్రిగేషన్ షెడ్లు


గంగాపూర్ సెగ్రిగేషన్ షెడ్డు

చింతలమానెపల్లి: పారిశుధ్య నిర్వహణ, సేంద్రియ ఎరువుల తయారీ కోసం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిర్వహణ సరిగా లేక శిథిలాల కుప్పగా మారుతున్నాయి. గంగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని షెడ్డు రేకులు లేచిపోయి, గోడలు కూలి అధ్వానంగా మారింది. మండలంలోని పలు గ్రామ పంచాయతీలలోని సెగ్రిగేషన్ షెడ్ల పరిస్థితి సైతం ఇదే మాదిరిగా ఉంది. షెడ్లు వినియోగంలోకి వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


కూలిపోయిన గోడలు


పగిలిపోయిన గచ్చు

గ్రామాల్లో ‘సమ్మక్క’ మొక్కుల సందడి


బెల్లం బుట్టలతో వెళ్తున్న భక్తులు

రెబ్బెన: ఫిబ్రవరి 21 నుంచి ప్రారంభమయ్యే సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా గ్రామాల్లో సమ్మక్క సారలమ్మ తల్లులకు చెల్లిస్తున్న మొక్కులతో సందడి నెలకొంటోంది. వన దేవతలకు భక్తులు బంగారం (బెల్లం) సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. దీంతో కిరాణా దుకాణాలు సమ్మక్క భక్తులతో రద్దీగా మారాయి. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లో పలువురు భక్తులు సమ్మక్క సాలరమ్మ తల్లులకు నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా కంకాలమ్మ, కేతేశ్వర స్వామి జాతర


పూజలు చేస్తున్న జాన్సన్ నాయక్


జాతరకు హాజరైన మంచిర్యాల డీసీపీ, ఏసీపీలు

జన్నారం: మండలంలోని ఈర్లగుట్టపై స్వయంభువుగా వెలసిన శ్రీ కేతేశ్వర కంకాలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. మహేంద్ర సంఘం సభ్యులు భక్తులకు ఏర్పాట్లు చేశారు. మండలంతో పాటు వివిధ మండలాలకు చెందిన పలువురు జాతరకు హాజరై స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పొనకల్ ఎంపీటీసీ గుండవరం హరిణి, మధుసూధన్‌రావు దంపతులు అన్నదానం చేశారు. మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ ఇన్‌చార్జీ జాన్సన్‌నాయక్, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, సర్పంచ్ భూమేశ్ తదితరులు హాజరై పూజలు జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ నర్సింగరావు, ఉపాధ్యక్షుడు చిలువేరు నర్సయ్య, సభ్యులు రాజన్న, కనకయ్య, అశోక్, మల్లయ్య, తదితరులు జాతర ఏర్పాట్లను పరిశీలించారు.

‘వారి సేవలు మరువలేం’

శ్రీరాంపూర్: విద్యారంగంలో వారు చేసిన సేవలు మరువలేనివని కోల్‌బెల్ట్ నస్పూర్ మండల ప్రైవేట్ పాఠశాల సంఘం నాయకులు తెలిపారు. ఇటీవల మృతి చెందిన బెల్లంపల్లికి చెందిన రాజా విద్యానికేతన్ కరస్పాండెంట్ ఎస్ రాజారెడ్డి, శ్రీరాంపూర్‌కు చెందిన విశ్వశాంతి కరస్పాండెంట్ రాయపూడి రాఘవ, ఆదర్శ పాఠశాల కరస్పాండెంట్ గాజుల రాజయ్యలకు ఆదివారం నస్పూర్‌లోని శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రైవేట్ పాఠశాల సంఘం నాయకులు బత్తిని దేవన్న, రేగళ్ల ఉపేందర్, సబిహా సుల్తానా, గోపతి సత్తయ్య, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ భవనం ప్రారంభం

దండేపల్లి: మండలంలోని కాసిపేటలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మెరుగైన వసతులతో కూడిన సౌకర్యాలు కల్పించేందుకు ఈజీఎస్ నిధులతో కొత్త భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు ఎండీ సలా వొద్దిన్ ఆదివారం తెలిపారు. జిల్లా గ్రామీణా భివృద్ధి సంస్థ కార్యాలయం ద్వారా అవకాశం కల్పించడం జరుగుతుందని, స్లాట్ బుక్ చేసుకోవడానికి ఫిబ్రవరి, మార్చి రెండు నెలలు అ వకాశం కల్పించడం జరిగిందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కార్మికుడికి పరామర్శ

శ్రీరాంపూర్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఆర్కే 5 గని సపోర్ట్ మెన్ మేకల రోహిత్‌ను ఐఎన్‌టీయూసీ నాయకులు పరామర్శించారు. ఆదివారం ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు, మహేందర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, కొట్టే తిరుపతి తదితరులు శ్రీరాంపూర్‌లోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

రోడ్లకు మరమ్మతులు


పనులు చేయిస్తున్న ఎస్సై ప్రవీణ్ కుమార్

లింగాపూర్: మారుమూల ప్రాంతాల్లోని గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తామని ఎస్సై కొట్టే ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని పిట్టగుడా పెద్దవాగు వంతెన మీదుగా లింగాపూర్ వరకు వెళ్లే రోడ్డు పూర్తిగా చెడిపోయి రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పోలీసులు మీ కోసంలో భాగంగా ఎస్సై ప్రవీణ్ కుమార్ మరమ్మతు పనులు చేయించారు. కానిస్టేబుల్ ఆర్.సుధాకర్, జాదవ్ ప్రదీప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలి


మాట్లాడుతున్న భరత్ చౌహాన్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతం అన్నిరంగాల్లో వెనుకబడి ఉందని ఈప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందని ఆయా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం గిరిజన భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. గతంలో ఉన్న రాజకీయ నాయకులు పట్టించుకోకపోవడం వల్ల ఆశించిన అభివృద్ధి జరగలేదన్నారు. ఇప్పటికైన ఆదిలాబాద్ నుంచి కాగజ్‌నగర్, లేదా మంచిర్యాల వరకు రైల్వే లైన్ సర్వే చేసి ఉట్నూర్ ప్రాంతానికి రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని కోరారు. సెంట్రల్ యూనివర్సిటీ, అగ్రికల్చర్ యూనివర్సిటీ, డెంటల్ యూనివర్సిటీ, మెడికల్ కాలేజీ అయినా మంజూరు చేయాలన్నారు. సోమవారం ఐటీడీఏ పీవోను కలిసి వినతి అందిస్తామన్నారు. ఫిబ్రవరి 2న కేస్లాపూర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నందున జిల్లాలోని ఎమ్మెల్యేలకు, ఎంపీటీలకు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు ఇవ్వాలని తీర్మానించారు. డిమాండ్ల సాధన కోసం తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా భరత చౌహాన్, కో కన్వీనర్లుగా బానోత్ రామారావు, నేతావత్ రాందాస్, ఆత్రం భుజంరావు, ముడుగు శామ్యూల్, బానోత్‌జగన్, గణేశ్, చంద్రకాంత్, సుధాకర్, వేషరావులను ఎన్నుకున్నారు.

విజయవంతం చేయండి

నెన్నెల: ప్రగతిశీల యువజన సంఘం (టీవైఎల్) ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో నూతన జా తీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 3న చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీవైఎల్ రాష్ట్ర నాయకులు మనోహర్ పిలుపునిచ్చారు. మండలంలోని మైలారంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మంచిర్యాలఅర్బన్: సిరిసిల్ల మినీ స్టేడియంలో శనివారం తెలంగాణ శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం నిర్వహించిన జోనల్‌స్థాయి స్పోర్ట్స్ అండ్‌గేమ్స్‌లో మంచిర్యాల శ్రీ చైతన్య పాఠశాల ఓవరల్ ఛాంపియన్‌గా నిలిచింది. పోటీల్లో 16బ్రాంచీలకు చెందిన పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు జోబిన్, పీఈటీలు అభినందించారు.